


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

నిజమైన వార్తలు • నిష్పక్షపాత విశ్లేషణ • ప్రజల పక్షాన అక్షరం

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 06 | శనివారం 6 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## హైటెక్స్‌లో థ్రెడ్ పోచంపల్లి చేనేత

### ప్రదర్శనను ఘనంగా ప్రారంభించిన మంత్రులు



జూన్ 5 వార్త సాక్ష్యం

హైటెక్స్‌లో థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శనను ఘనంగా ప్రారంభించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఏఎస్ నేతృత్వంలో హైదరాబాద్ లోని హైటెక్స్ హాల్ నెంబర్ 4 లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శన,విక్రయ కేంద్రాన్ని - మిగతా2లో

# వట్టెం పంప్ హౌస్ మూడో లిఫ్ట్‌ను సందర్శించిన సీఎం



జూన్ 5 వార్త సాక్ష్యం

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను రెండు రోజులపాటు పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామం వద్ద ఉన్న వట్టెం పంపు హౌస్ మూడో లిఫ్టును సందర్శించారు. ఎస్ జె ఆర్ పిఆర్ఎల్ఐఎస్ ( పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్) లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. - మిగతా2లో

## భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక ఆఫర్

జూన్ 5 వార్త సాక్ష్యం

ఐదో తరం ఫైటర్ జెట్స్‌ను సమకూర్చుకునేందుకు భారత్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్‌యూ-57 యుద్ధ విమానాన్ని భారత్‌తో కలిసి సయుక్తంగా తయారు చేసేందుకు తాము సిద్ధమేనని అన్నారు. ఈ ఫైటర్ జెట్‌కు సంబంధించి కీలక సాంకేతికతలను కూడా భారత్‌కు బదిలీ చేస్తామని పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మీడియాతో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. - మిగతా2లో



## మళ్లీ యుద్ధం ప్రకటించడానికి అదే మంచి కారణమవుతుంది: ట్రంప్

జూన్ 5 వార్త సాక్ష్యం

అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ గనుక అమెరికా సైనికులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడితే, ఆ దేశంపై మళ్లీ పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించడానికి అది బలమైన కారణంగా మారుతుందని - మిగతా2లో



## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం:

### గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు




జూన్ 5 వార్త సాక్ష్యం

భాగ్యనగరంలో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. ఎబోలా తరహా లక్షణాలతో ముగ్గురు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంతో అప్రమత్తమైన తెలంగాణ ఆరోగ్య శాఖాధికారులు, బాధితులను ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉంచారు. వివరాల్లోకి వెళితే.. - మిగతా2లో

## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!



జూన్ 5 వార్త సాక్ష్యం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ - మిగతా2లో

## తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాల కొత్త దారులు చూపుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు




జూన్ 5 వార్త సాక్ష్యం:

తెలంగాణ యువతను ప్రపంచ ఉద్యోగ విపణికి సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాత ఐటీఐలకు సరికొత్త రూపు కల్పించి వాటిని అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసిందని రాష్ట్ర - మిగతా2లో

## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు

- అమరావతి నుంచి నెల్లూరు వరకు ఆక్వా కారిడార్ అభివృద్ధికి ప్రణాళిక
- భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా 38 శాతం అని వెల్లడి
- ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ

2



## ఏపీలో స్మార్ట్ సిటీలు.. రష్యాలో మంత్రి లోకేశ్ కీలక భేటీ

- సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ అధికారితో మంత్రి లోకేష్ భేటీ
- సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల ఏర్పాటుపై కీలక చర్చలు
- ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ఇరుపక్షాల నిర్ణయం



2

# భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక ఆఫర్

-మొదటిపేజీ తరువాయి

చైనా తయారు చేసిన ఐదో తరం యుద్ధ విమానం జే-35ఏఈని పాక్ కొనుగోలు చేయనుందన్న వార్తలు ఇప్పటికే రక్షణ వర్గాల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యం పుతిన్ ఆఫర్‌కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం భారత్ వద్ద 5వ తరం యుద్ధ విమానాలు లేవు. అయితే, మధ్యశ్రేణి 5వ తరం యుద్ధ విమానం అభివృద్ధికి భారత్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. 2035 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈలోపు తక్షణ అవసరాల కోసం మరో ఫైటర్ జెట్ కోసం భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదనకు ప్రాధాన్యం ఏర్పడింది. 'భారత్‌కు ఈ ఫైటర్ జెట్‌ను సరఫరా చేసేందుకు మేము సిద్ధంగానే ఉన్నాము. ఈ విషయంలో ఎలాంటి పరిమితులు, సమస్యలు లేవు. గగతనల రక్షణ వ్యవస్థలకూ ఇది వర్తిస్తుంది. వాస్తవానికి గతంలోనే ఈ విమానాన్ని సంయుక్తంగా అభివృద్ధి చేద్దామని మేము ప్రతిపాదించాము. కానీ ఈ ప్రాజెక్టులో మేము తరువాత చేరుతామని భారత్ చెప్పింది. మేము ఇప్పుడు దీన్ని సొంతంగానే నిర్మించుకున్నాము. అయితే, భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగానే ఉన్నాము' అని పుతిన్ చెప్పారు. రక్షణ రంగంలో భారత్‌కు సహకరించే విషయంలో తాము ఎలాంటి పరిమితులు పెట్టుకోమని స్పష్టం చేశారు. పాశ్చాత్య దేశాల నుంచి భారత్ అత్యాధునిక విమానాలు దిగుమతి చేసుకున్నప్పటికీ సాంకేతికత, కీలక సాఫ్ట్‌వేర్ బదిలీకి సంబంధించి చిక్కులు ఎదురవుతున్నాయి. ఇక ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ ఎస్‌యూ-57 విమానాల కొనుగోలుకు సిద్ధమైందని అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. శత్రుదేశ రాడాలర్లకు చిక్కకుండా ఉండేందుకు స్టెల్త్ టెక్నాలజీ, అత్యాధునిక ఏవియానిక్స్, అసాధారణ మెనూవరబిలిటీ ఉన్న ఎస్‌యూ-57ని బహుళార్థసాధక ఫైటర్ జెట్‌గా రష్యా అభివృద్ధి చేసింది. భూతల దాడులు, సముద్రదాడులతో పాటు గగనతలంలోని లక్ష్యాలను ఛేదించేలా ఈ ఫైటర్‌జెట్‌ను డిజైన్ చేసింది. అయితే, తమ అవసరాలకు ఇది తగినది కాదని భారత వర్గాలు అప్పట్లో భావించాయి.

# మళ్లీ యుద్ధం ప్రకటించడానికి అదే మంచి కారణమవుతుంది: ట్రంప్

-మొదటిపేజీ తరువాయి

గురువారం వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని అమెరికా ఇప్పటికే పూర్తిగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. 'ఒకవేళ వాళ్లు మా సైనికులను చంపితే, యుద్ధాన్ని తిరిగి ప్రారంభించడానికి అది సరైన కారణం అవుతుంది. ప్రస్తుతం ఇరాన్ వద్ద నౌకాదళం కానీ, వాయుసేన కానీ లేవు. వారి నాయకత్వాన్ని మేము పూర్తిగా తుడిచిపెట్టేశాం. ఇరాన్ వద్ద ఉన్న 159 నౌకలు ప్రస్తుతం సముద్ర గర్భంలో ఉన్నాయి, వాటికి సంబంధించిన ఫొటోలు కూడా మా వద్ద ఉన్నాయి. అయినా సరే, ఇరాన్ యుద్ధంలో బాగా రాణిస్తోందంటూ ఫేక్ న్యూస్ మీడియా కథనాలు రాయడం నమ్మశక్యం కావడం లేదు' అని ట్రంప్ మండిపడ్డారు. మరోవైపు, ఇరాన్‌పై డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా సైనిక చర్యలు తీసుకోకుండా నిలువరించేందుకు అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) బుధవారం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించింది. ట్రంప్ యుద్ధ అధికారాలను పరిమితం చేసేలా డెమొక్రాట్లు ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అనుకూలంగా 215 ఓట్లు, వ్యతిరేకంగా 208 ఓట్లు వచ్చాయి. విశేషం ఏంటంటే, ట్రంప్‌నకు చెందిన రిపబ్లికన్ పార్టీకి చెందిన నలుగురు సభ్యులు కూడా డెమొక్రాట్లతో చేతులు కలిపి ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. గత ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడిగా సైనిక దాడులు ప్రారంభించిన తర్వాత.. ట్రంప్ దూకుడుకు అడ్డుకట్ట వేసేలా కాంగ్రెస్ తీసుకున్న మొదటి విజయవంతమైన చర్యగా ఇది నిలిచింది. ప్రస్తుతం ఈ తీర్మానం సెనేట్ ఆమోదం కోసం పంపించారు. తన అధికారాలను పరిమితం చేస్తూ ప్రతినిధుల సభ తీసుకున్న నిర్ణయంపై డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా

-మొదటిపేజీ తరువాయి

ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది. ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది.

# ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని, భారతదేశ బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగ అభివృద్ధికి తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు గణాంకాలతో వివరించారు. "దేశ మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతం, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం మనదే. దేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 38 శాతం, అంటే సుమారు రూ.28,000 కోట్లకు పైగా ఏపీ నుంచే సమకూరుతోంది. ప్రపంచ సీ-ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం 5 శాతమే ఉంది. దీన్ని పెంచడానికి అపార అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, దేశ ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆక్వా రంగం సమగ్రాభివృద్ధికి ఒక బృహత్ ప్రణాళికను చంద్రబాబు ప్రకటించారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక 'ఆక్వా కారిడార్' అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. "ఈ కారిడార్‌లో పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఒక సమగ్ర ఎకో సిస్టం ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే మా లక్ష్యం. 'పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్' అనే విధానంతో ముందుకు సాగుతాం" అని తెలిపారు. 'ఆంధ్రా రొయ్య... ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 15 రోజుల్లోగా అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. "21వ శతాబ్దం నరేంద్ర మోదీదే. సరైన సమయంలో దేశానికి దొరికిన సరైన నేత ఆయన. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా కృషి చేస్తున్నారు. ఆయనను మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశానికి తాను సైకిల్‌పై వచ్చానని, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని సూచించారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏపీలో స్మార్ట్ సిటీలు.. రష్యాలో మంత్రి లోకేష్ కీలక భేటీ

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల నిర్వహణ కోసం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్.. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు లోకేష్ వివరించారు. ప్రధానంగా సేఫ్ & స్మార్ట్ సిటీల నిర్మాణం కోసం పౌరులతో చర్చలు జరపడం, డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, నగరాల్లో విశ్వసనీయమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. ఏపీలో స్మార్ట్ సిటీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాన్ని పంచుకునేందుకు ఈ ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈ సహకారంతో రాష్ట్రంలోని నగరాలను మరింత సురక్షితంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## వట్టెం పంప్ హౌస్ మూడో లిఫ్ట్ ను సందర్శించిన సీఎం

-మొదటిపేజీ తరువాయి

2020- 2023 సంవత్సరం నాటికి రూ 3300 కోట్లు ప్రాజెక్టుకు ఖర్చు చేయగా, 2023వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు రూ. 800 కోట్లను ఖర్చుచేసి ప్రాజెక్ట్ పనులను కొనసాగించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగతా సివిల్ పనులను రూ.90 కోట్లతో వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇక్కడ మొత్తం 10 పంపులు ఉండగా 5 పంపులను ఫిట్ చేసి ట్రయల్ రన్ ను విజయ వంతంగా నిర్వహించామన్నారు. వర్షాకాలంలో నీళ్లు రాగానే వెంకటాద్రి రిజర్వాయర్ కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం మొత్తం 16.74 టీఎంసీలు కాగా స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం ద్వారా విడతల వారీగా రిజర్వాయర్ ను నింపడం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం 12 లక్షల ముప్పై వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అలాగే మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలకు తాగునీటికి, పరిశ్రమలకు కూడా నీళ్లు అందుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## హైటెక్స్‌లో థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శననుఘనంగా ప్రారంభించిన మంత్రులు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ వైభవ ప్రారంభోత్సవ వేడుకలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఏఎస్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రదర్శనలోని చేనేత స్టాళ్లను సందర్శించారు. భువనగిరి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చేనేత కుటుంబాల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తామని ఎంపి చామల మాట్లాడారు. హైదరాబాద్ నగర ప్రజలు, చేనేత ప్రియులు జూన్ 5 నుండి జూన్ 7 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ చైర్మన్ వెంకరమణ, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, ప్రజాప్రతినిధులు చేనేత జౌళి శాఖ , ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం: గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు

-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం ఉదయం ఎబోలా ప్రాథమిక లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిని ఆశ్రయించారు.పరిస్థితిని గమనించిన వైద్యులు వారిని తక్షణమే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో గాంధీ లో చేరిన ఎబోలా అనుమానితుల సంఖ్య మూడుకు చేరుకుంది. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముగ్గురు ఒకే అంతర్జాతీయ విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నట్లు వెల్లడి కావడంతో, సదరు విమానంలో ప్రయాణించిన ఇతర ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, అంతకుముందు గురువారం నాడు సూడాన్ నుంచి ఇథియోపియా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న 30 ఏళ్ల వ్యక్తిని విమానాశ్రయ వైద్య బృందం గుర్తించింది. థర్మల్ స్క్రీనింగ్‌లో అతనికి 100 డిగ్రీల జ్వరం ఉన్నట్లు తేలింది. ఇటీవల ఎబోలా ప్రభావిత దేశాలైన ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో అతడు పర్యటించినట్లు సమాచారం అందడంతో, అధికారులు ముందుజాగ్రత్తగా అతడిని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు.

## తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాల కొత్త దారులు చూపుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

-మొదటిపేజీ తరువాయి

కార్మిక,ఉపాధి,గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి తెలిపారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలు మాత్రమే కాకుండా, రాష్ట్ర యువతకు ఉపాధి,నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ అవకాశాల వేదికలుగా మారుతున్నాయని ఆయన అన్నారు. మల్లేపల్లిలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను మీడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు,ట్రైనర్లు అక్కడ అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాలు, నేర్చుకుంటున్న సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి రంగాన్ని బలోపేతం చేసేందుకు సుమారు 40,000 కోట్ల రూపాయల పెట్టుబడులను సమీకరించిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ఇప్పటికే సత్ఫలితాలు ఇస్తోందని, యువతకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు యువతకు ఒక సువర్ణావకాశమని పేర్కొన్న మంత్రి, విద్యార్థులు ఈ అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమ శిక్షణ, అంకితభావం, నిరంతర సాధన తోనే జీవితంలో విజయం సాధించవచ్చని అన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేస్తున్నాయి"అని మంత్రి పేర్కొన్నారు. ఐటీఐల భౌతిక వసతుల అభివృద్ధితో పాటు ట్రైనర్లకు కూడా వివిధ స్థాయిల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను తయారు చేయడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా నిలబెడతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

## శ్రీ స్వామి అమ్మవార్ల ఊయల సేవ



శ్రీశైలం జూన్ 5 వార్తా సాక్ష్యం

శ్రీ శైల దేవస్థానంలో శుక్రవారం లోక కల్యాణం కోసం శ్రీస్వామి అమ్మ వార్లకు ఊయలసేవను నిర్వహించారు. ప్రతి శుక్రవారం రోజు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించి భక్తులకు స్వామి అమ్మవార్లు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించ బడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామి అమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణకు దాతల విరాళం

శ్రీశైలం జూన్ 5 వార్తా సాక్ష్యం



శుక్రవారం శ్రీశైల దేవస్థానం లో అన్న ప్రసాద వితరణకు, కే. ఉమాదేవి, హైదరాబాద్‌కు చెందిన కుటుంబం, రూ 1,00,000/–లను పర్య వేక్షకులు కే, అయ్యన్నకు ఈ విరాళాన్ని అందజేయడం జరిగింది. దాతకు తగు రసీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి. శ్రీశైలం పుణ్యక్షేత్రం లో భక్తాదులకు అన్నదానం కోసం విరాళాలు అందించిన కుటుంబాలకు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఉంటాయని పురోహితులు తెలియజేశారు.

## శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు




శ్రీశైలం జూన్ 5 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళా రాధన కార్యక్రమం) శుక్రవారం ఆలయంలో అందెల రవళి నాట్యాలయం, నిజమాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించ బడుతున్నది. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, శంకర శ్రీగిరి, శివ పంచాక్షరీ, భో…శంభో తదితర గీతాలకు స్వప్న, వర్ణ శ్రీ, వైష్ణవి, ప్రణతి, సాత్విక, హంసిని, కారుణ్య, సహస్రాక్షర, గీత, మోక్షజ్ఞ, సహస్ర, ప్రపూర్ణ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్య కళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

ఆస్పరి జూన్ 5 వార్త సాక్ష్యం



తిరుమల తిరుపతి దేవ స్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, డి.కోటకొండ గ్రామం లోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవస్థానంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం చివరి రోజు కావడంతో ఆలయ ప్రాంగణంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజులు స్థానిక భజన మండలిచే భజనలు, స్వాత్మానంద స్వామి చేసిన శ్రీమద్రామాయణ, మహాభారత, భగవద్గీతలపై చేసిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గ్రామపెద్దలు కె.గంగాధర రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ డి.కె.హనుమంతు, భజన మండలిసభ్యులు కొండారెడ్డి,రామాంజనేయులు, అర్చకులు శ్రీనువాసులు, గోపాల్, రామిరెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దేవస్థానం పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాలు

- యోగా కార్యక్రమాల నిర్వహణ
- ముందస్తుగా జూన్ 6,7 తేదీలలో యోగా శిక్షణా కేంద్రాలు
- జూన్ 8వ తేదీన గంగాధరమండపం వద్ద ప్రత్యేక యోగా కార్యక్రమం
- జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగాదినోత్సవం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం

శ్రీశైలం జూన్ 5 వార్త సాక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమములో భాగంగా జూన్ 8వ తేదీన భారీస్థాయిలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు కార్య నిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు సంయుక్తంగా శుక్రవారం మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికార యంత్రాంగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. యోగా కార్యక్రమానికి ముందస్తుగా జూన్ 6,7వ తేదీలలో చంద్రవతి కల్యాణ మండపంలో యోగాశిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో యోగా గురువులచేత ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. ఇప్పటికే ఈ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టబడుతు న్నాయన్నారు. జూన్ 8వ తేదీన నిర్వహించనున్న ప్రత్యేక యోగా కార్యక్రమానికి గంగాధర మండపం వద్ద ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు యోగానిర్వహణకు ఆయా ఏర్పాట్లు చేయబడుతున్నాయన్నారు. జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని కూడా గంగాధరమండపం వద్దనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్థానికులు యాత్రికులు ఈయోగా కార్యక్రమములో పాల్గొని ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వాములు కావాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# నక్కంటి రేంజ్ జంగిల్ రైడ్ ఇష్టకామేశ్వరి వద్ద మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం





శ్రీశైలం జూన్ 5 వార్త సాక్ష్యం

ప్రపంచ పర్యావరణం దినోత్సవ సందర్భంగా శ్రీశైలం మండల కేంద్రంలోని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శిఖరం వద్ద గల నక్కంటి జంగిల్ రైడ్ ఇష్టకామేశ్వరి సెక్టార్ దగ్గర, నూతన ట్రైనీ రేంజర్ యోగేశ్వర్ రెడ్డి, ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అనేక పర్యాటకుల సమక్షంలో పర్యాటకుల చేత మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిఆర్ఓ సాయికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం మొత్తం 2.50 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని, అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పదిలో 30 లక్షలు మొక్కలు నాటే కార్యక్రమం, చేపట్టడం జరుగుతుందని అన్నారు డివిజన్ పరిధిలో ఎనిమిది లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని అటవీశాఖ తోనే సాధ్యమవుతుందని వివరించారు నక్కంటి జంగిల్ రైడ్ ఇష్టకామేశ్వరి వద్ద మొక్కలు నాటే కార్యక్రమం జరుగు తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఎఫ్ బి ఓ గురవయ్య పర్యాటకులుఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కురుకుంద గ్రామంలో "గో టు విలేజ్" విజయవంతం

ఆత్మకూరు జూన్ 5 వార్త సాక్ష్యం



మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ ఎమ్మెస్పీ జాతీయ నాయకులు చిలుక రాబిన్సన్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు భాష పోగుల దరగయ్య సూచన సలహాలు మేరకు గో టూ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు. గో టు విలేజ్ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ ఆత్మకూరు మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య అధ్యక్షతనంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లె బుజ్జి, నియోజకవర్గ నాయకులు భాషా పోగుల చిన్న వెంకటరమణ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ సుదీర్ఘమైన పోరాటం ఫలితంగా ఏబిసిడి వర్గీకరణ సాధించుకున్నామని, వర్గీకరణ ఫలాలు అనుభవించాలంటే ఉన్నతమైన చదువులు చదవాలని యువతకు విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. జులై 7వ తేదీన 32వ ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సూచించారు. విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ బడి మానేసిన పిల్లలను చదవాలని తెలియజేశారు. మాదిగ జాతి విద్యా ఉద్యోగ సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చదివే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణరావు, దీనుడు నాగలింగ స్వామి, లింగన్న గోపాల్, యువత విద్యార్థిని విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మ పేరు పై మొక్కలు నాటండి.. ఎంపీడీవో తాసిల్దార్

- కస్తూరిబా, మోడల్ స్కూల్ లలో మొక్కలు నాటే కార్యక్రమం

పాములపాడు జూన్ 5 వార్త సాక్ష్యం



శుక్రవారం పాములపాడు పట్టణ కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కస్తూరిబా మోడల్ స్కూల్‌లలో అనంత అరణ్య( ఐడన్ సిటీ ప్లాంటేషన్) కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్, మండల తాసిల్దార్ సుభద్రమ్మ, ఆధ్వర్యంలో గుంతలు తీయించి మొక్కలు నాటే కార్యక్రమం" చేపట్టారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మండల అధికారులు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున మా నామ్ క ఏక్ పెడ్ హై ( అమ్మ పేరు పైన ఒక మొక్క నాటే కార్యక్రమం విజయవంతంగా చేపట్టడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు మొక్కలు నాటడం వల్ల పర్యావరణం పరిరక్షణకై పాటుపడేవారు అవుతారని తెలిపారు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే విధంగా అలవాటు చేసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మద్దూరుతిమ్మా రెడ్డి గోవింద్ ,ఈఓ ఆర్ డి ,హార్ట్ ఫుల్ ఫౌండేషన్ ఎన్జీవో సభ్యులు స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో. జయంతి సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
శనివారం 6 జూన్, 2026

# గత వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా రైతుల భూములను దోచేయాలని చూసింది : ఎమ్మెల్యే గిత్త జై సూర్య

నందికొట్కూరు జూన్ 5 వార్త సాక్ష్యం

నందికొట్కూరు మండల పరిధిలోని శుక్రవారం వడ్డేమాన్ గ్రామంలో సచివాలయం వద్ద "మీ భూమి మీ హక్కు" రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య కు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఆహ్వానం పలికారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.... చేతల ప్రభుత్వం అని.... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు తొలి సంతకం ల్యాండ్ టైటిల్ ఆక్ట్ పై సంతకం చేసి ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి దక్కుతుంది అని ఎమ్మెల్యే తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీనం చేసిన గత పాలకులు. గత వైసిపి ప్రభుత్వంలో రిసర్వే పేరుతో రెవెన్యూ శాఖలో భారీగా అవకతవకలు జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో



రైతు పట్టాదారు పాసుపుస్తకాల పై మాజీ సీఎం ఫోటో ముద్రించి పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో భూరక్ష పథకం కింద భూముల రీసర్వే కోసం సర్వే రాళ్లకు సుమారు 600 కోట్లు ఖర్చు పెట్టడంతో పాటు సర్వే రాళ్లపై మాజీ సీఎం ఫోటోతో పాటు లోగోలు ముద్రించడం జరిగింది అని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఎలక్షన్ సమయంలో యువనాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో 70% భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లిన రైతులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ భూమి పై మీకు సర్వ హక్కులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దానిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో రీ సర్వేలో నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నందికొట్కూరు మండలం వడ్డమాను పంచాయతీలో నిర్వహించిన రీ సర్వే పూర్తి చేసి 1090 మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాజ ముద్రతో ముద్రించిన పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కి ఎమ్మెల్యే గిత్త జయసూర్యకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, సత్యం రెడ్డి, మండల స్థాయి రెవెన్యూ అధికారులు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

జూన్ 5 వార్త సాక్ష్యం

బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబం ధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు.పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని,ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత,పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తుల కు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. అనంతరం 2026-27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్,ఎస్ బి ఐ,టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్,నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్




బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిందితులకు శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకం


-స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ తో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు..

జూన్ 5 వార్త సాక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు డ్యూటీ అధికారులకు కేసుల పట్ల పూర్తి అవగాహన స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కల్పించాలని సూచనలు చేశారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్రంగా కేసులను పర్యవేక్షించాలని ఆదేశాలను జారీ చేశారు. సమ్మన్స్, వారెంట్ల జారీలో జాప్యం లేకుండా సకాలంలో సాక్షులకు మరియు నిందితులకు



అందజేయాలని సూచించారు. కోర్టులో విచారణ నడిచే సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసుకోవాలని, సాక్షులకు కేసు వివరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీని ఎప్పటికప్పుడు కోర్టులో హాజరు పరచాలి అని సూచనలు చేశారు.కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ, నేరస్తులకు శిక్ష పడే విధంగా



కేసుల పరిష్కారంలో కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో జాప్యంపై ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి

-యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం..

-స్టేషన్ ఆవరణలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రామసహాయం ..

జూన్ 5 వార్త సాక్ష్యం

ఖమ్మం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల తీరుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఎంపీ.. సుమారు గంటన్నర పాటు స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు.

-క్షేత్రస్థాయిలో తనిఖీ..


ఎస్కలేటర్ ను ఆన్ చేయించి రెండో ప్లాట్‌ఫామ్‌కు చేరుకొని దాని పనితీరును గమనించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ మేనేజర్




కార్యాలయానికి వెళ్లి, నిర్మాణాలకు సంబంధించిన మ్యాప్‌లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..ఆధునికీకరణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

-ప్రయాణికులకు ఇబ్బందులు రానీయొద్దు..

వర్షాకాలం సమీపిస్తుండటంతో అసంపూర్తిగా ఉన్న పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే



ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గన్ పార్క్‌లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జూన్ 5 వార్త సాక్ష్యం:

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు.పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
-వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలి
-మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి



జూన్ 5 వార్త సాక్ష్యం:

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా వెల్గటూర్ మండలం పాశిగామ, స్తంభం పెల్లి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసి వెను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు.వర్షాలకు కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్.డి.వో మధుసూదన్, డీ.ఎస్.వో మనోజ్ కుమార్, డి.ఎం.జితేంద్ర ప్రసాద్, తహసిల్దార్, ఎంపిడివో, ఎంపివో సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక



## ప్రతి ఒక్కరు "అమ్మ పేరు"తో మొక్కను నాటండి

-జీజీహెచ్ లో మొక్కలు నాటిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



జూన్ 5 వార్త సాక్ష్యం

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో మొక్కలు నాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. ప్రధానిగా మోదీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం అంటే రాబోయే తరాలకు ఇచ్చే గొప్ప ఆస్తి అని చెప్పారు. మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ పుష్టిగా లభిస్తుంది అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని గుర్తు చేశారు. మిషన్ లైఫ్ పేరుతో ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, నీటి సంరక్షణ పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలలు కళాశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం విరివిగా కొనసాగుతుందన్నారు. ప్రధాని మోదీ ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని పిలుపునివ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికే అనేకమంది మోదీ పిలుపును పాటిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమోహన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, డాక్టర్ హరీష్ స్వామి, డాక్టర్ రాఘవేంద్ర చిద్రావార్, నాయకులు మాయావార్ కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరిచాలి

-కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

-ఈ.వి. ఎమ్ గోదాం తనిఖీ



జూన్ 5 వార్త సాక్ష్యం

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. జిల్లా కేంద్రం లోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలనీ సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్‌లను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదులను వి వి ప్యాట్ స్టోరేజీ విధానాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అదరపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏన్, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , సిపియం పార్టీ ప్రతినిధి డి, నరేష్ పటేల్, ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, బిజెపి పార్టీ ప్రతినిధి బి సాయికృష్ణ ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాలి

జూన్ 5 వార్త సాక్ష్యం:

పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులందరికీ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ కాలుష్యం కారణంగా నేడు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటు న్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజు నాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది తమ తమ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రమాద ౸వశాత్తు నిప్పు అంటుకొని ప్రతి ఏడాది అడవులు దగ్ధమవుతు న్నాయని, దీని ద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. అడవులు కాలిపోకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరిం చాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. కళాజాత బృందాలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల,అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే,సీనియర్ సివిల్ జడ్జి రవీందర్,డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,ఎఫ్డిఓ నాగిని బాను,ఇతర అధికారులు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత జిల్లా కలెక్టర్ రాజర్షిషా

-పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మన వంతు భాగస్వామ్యం అందించాలి

-ఎస్పీ అఖిల్ మహాజన్

జూన్ 5 వార్త సాక్ష్యం:

మారుతున్న వాతావరణ పరిస్థితులు,గ్లోబల్ వార్మింగ్ సవాళ్లనుఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు"ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదిలాబాదు గ్రామీణ మండలం యాపల్‌గూడ బీట్‌లో అడవుల పునరుజ్జీవనం కోసం సరికొత్త హై డెన్సిటీ మిక్స్ డ్ ప్లాంటేషన్ విధానంలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ బృహత్తర కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపుదలే ధ్యేయంగా ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృతం అవగాహన కల్పిస్తూ సంరక్షిస్తుందని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు,గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం-ప్రగతికి ప్రణాళిక"అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వా ములు కావాలని పిలుపుని చ్చారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షించడం అంతకంటే



ముఖ్యమని,నాటిన ప్రతి మొక్కను బ్రతికించుకునేలా అధికారులు,ప్రజలు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. పాస్టిక్ వినియోగాన్ని తగ్గించి తమ వంతు బాధ్యత గా మెలగని సూచించారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. పోలీస్ శాఖ తరఫున జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకానికి, అడవుల రక్షణకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ హరిత సంకల్పం విజయవంతం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆదిలాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ నిరోష, డిఎస్పీ జీవన్ రెడ్డి,ఎఫ్డిఓ అరవింద్, ప్రజాప్రతి నిధులు,గ్రామస్తులు. విద్యార్థులు,అటవీ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జూన్ 5 వార్త సాక్ష్యం:

ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్( స్థానిక సంస్థలు)పి చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి రాములు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపపాలన అధికారి డి.చంద్రకళలతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 25 నుండి జూలై 24వ తేదీ వరకు ఇంటింటి గణన చేపట్టాలని, ఎన్యుమరేషన్ ఫారం నమోదు తర్వాత బూత్ స్థాయి అధికారులు వివరాలను పరిశీలించాలని,సరైన అర్హత గల ఓటర్ల ముసాయిరా జాబితా తయారుచేసి, నివేదికలపరిశీలించి హేతుబద్ధీకరించిన ముసాయిదా జాబితాను 31 తేదీన ప్రచురించాలని తెలిపారు. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించాలని, జూలై 31 వ తేదీ నుండి సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలపై నిర్ణయం,ఫిర్యాదులు, అభ్యంతరాలు పరిష్కరించే దిశగా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాల ని, ఒక పోలింగ్ కేంద్రం పరిధిలోని కుటుంబానికి సంబంధించిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధి లోనికి వచ్చే విధంగా జాబితా రూపొందించాలని తెలిపారు. మ్యాపింగ్, ఓటర్ల తొలగింపు ప్రక్రియలలో రాజకీయ పార్టీల నుండి నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని,అర్హత గల ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా 2 ఆపైన ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉన్నట్లయితే స్వచ్ఛందంగా తొలగించు కోవాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండాలని,విషయమై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ కార్డులు కలిగి ఉన్నట్లయితే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మరణించిన వారి వివరాలు ఎట్టి పరిస్థితులలో జాబితాలో రాకూడదని,ఒకవేళ తుది జాబితాలో మరణించిన వారి వివరాలు వచ్చినట్లయితే సంబంధిత బూత్ స్థాయి అధికారి పై చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు. వివరాల సేకరణ, ఫారాల పూరింపు,జాబితా పరిశీలన, ఇతర అంశాల పై బూత్ స్థాయి అధికారులు,రాజకీయ పార్టీలచే నియమింప బడిన బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ,పూరింపు, 2002 ఓటర్ల జాబితాలో వివరాల పరిశీలన, చిరునామా మారినట్లయితే వివరాల నవీకరణ, ఎన్యుమరేషన్ ఫారంలో సవరణ ప్రక్రియలు సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాల వయసు వచ్చే ఓటర్లు ఇంటింటి గణన కార్యక్రమంలో ఫారం 6, డిక్లరేషన్ ఫారం పొంది దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారం పూరించడంలో ఓటర్ల వివరాలు వెతకడంలో ఓటర్లు టోల్ ఫ్రీ ఓటర్ హెల్ప్ లైన్ నెంబర్ 1950, ఆన్లైన్ లో https://voters.eci. gov.in వెబ్ సైట్‌లో, ECINET యాప్‌లో సంప్రదిం చవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ సజావుగా సాగేలా, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందిం చేందుకు బూత్ స్థాయి అధికారులకు సహకరించాల ని తెలిపారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును త్రైమాసిక తనిఖీలలో భాగం గా ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం గోదాము వద్ద నిరంతర భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఈవీఎం రక్షణ దిశగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి





**-టీఏసీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**

జూన్ 5 వార్త సాక్ష్యం

ఖమ్మం: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తన సేవలను మరింత వేగవంతం చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ (టిఏసి) సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

**-సేవల్లో నాణ్యత పెరగాలి..**

ఈ సందర్భంగా మాట్లాడుతూ. మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన బాధ్యత. బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని సూచించారు.

**-సమస్యల పరిష్కారమే లక్ష్యం..**

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్‌వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

**-సంస్థ బలోపేతం అందరి బాధ్యత..**

బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, యాసా వెంకటేశ్వర్లు, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్ నాయక్, కనకరాజు, మచ్చా రామారావు, రామ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కన్నతల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

**-ఖమ్మం జిల్లాలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం..**

**-పిలుపునిచ్చిన బీజేపీ నేత రంగారాజు రుక్మారావు**

జూన్ 5 వార్త సాక్ష్యం

ప్రతి ఒక్కరూ తమ కన్నతల్లి పేరుతో ఒక మొక్కను నాటి, ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగారాజు రుక్మారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం జిల్లాలోని ఎదలాపురం మున్సిపాలిటీ, వైరా మున్సిపాలిటీల పరిధిలోని పలు ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో కలిసి నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రంగారాజు రుక్మారావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు "ఏక్ పేడ్ మా కే నామ్" అనే ఒక అద్భుతమైన పిలుపునిచ్చారని, దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో, ప్రతి కుటుంబం తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించేలా ఇదొక ప్రజా ఉద్యమంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 2014 నుంచే పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే దేశవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించేలా అనేక కార్యక్రమాలు నిరంతరం



కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 260 కోట్లకు పైగా మొక్కలు నాటడం ద్వారా భారతదేశాన్ని హరితమయం చేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కేంద్రం గొప్ప కృషి చేస్తోందని కొనియాడారు. ప్రకృతిని కాపాడుకోవడం, వాతావరణ సమతుల్యతను పరిరక్షించడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని, ఇది మనందరి కనీస బాధ్యతని రుక్మారావు స్పష్టం చేశారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఈ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరిని ఇందులో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలందరూ "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, ప్రతి ఇంట్లో తల్లి పేరుతో ఒక మొక్కను నాటి పచ్చని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ నాయక్, జిల్లా కో-కన్వీనర్ శ్రీరామనేని మణి, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి సాయి, వేల్పుల సుధాకర్, ఆర్వీఎస్ యాదవ్, కోటమర్తి సుదర్శన్, సత్తి నాగరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులు

**-విద్యార్థులను అభినందించిన కరీంనగర్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం**

జూన్ 5 వార్త సాక్ష్యం:



జగిత్యాల జిల్లా కు చెందిన నలుగురు విద్యార్థులు కరాటే లో సత్తాచాటి బ్లాక్ బెల్ట్ సాధించారు. కరీంనగర్ లోని వివేకానంద రెసిడెన్సియల్ స్కూల్ లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీల్లో జగిత్యాల ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన శిక్షకుడు మర్రిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎస్. చక్రి ,కె. సాయి చరణ్, బి. సౌమిత్ రాజ్, కె. చైతన్య విశేష ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్నారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ & చీఫ్ ఎగ్జామినర్ కే వసంత్ కుమార్ బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు బెల్ట్ మరియు సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు. బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులను కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ అలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని ముఖ్యంగా యువత వ్యసనాలకు అలవాటు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని అమ్మాయిలు ఆత్మ రక్షణ విద్య కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ మరిపెల్లి లింగయ్య, ఎంఏ మన్నన్, అనంతుల కాంతారావు, నరేష్, రాజశేఖర్, సంతోష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## గ్రేవ్ క్రైమ్ కేసుల దర్యాప్తుపై సి.ఐలతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం

జూన్ 5 వార్త సాక్ష్యం



:నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ క్రైమ్ కేసుల దర్యాప్తు పురోగతి , నిందితుల అరెస్టులు , పెండింగ్ కేసుల స్థితిగతులు , ఛార్జ్‌షీట్ల దాఖలు మరియు కోర్టు విచారణలపై పోలీస్ కార్యాలయంలో నిజామాబాదు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో (సి.ఐలు) సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన హత్య , హత్యాయత్నం , దోపిడీ , చోరీ , మహిళలు మరియు చిన్నారులపై నేరాలు , పోక్సో , మోసం , అపహరణ తదితర గ్రేవ్ క్రైమ్ కేసులను ఒక్కొక్కటిగా సమీక్షించారు. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులను చట్టం ముందు నిలబెట్టాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సాంకేతిక ఆధారాలు , సీసీటీవీ ఫుటేజ్ , కాల్ డేటా విశ్లేషణ , ఫోరెన్సిక్ సాక్ష్యాలు మరియు ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి కేసులో సాక్ష్యాధారాలను పటిష్టంగా సేకరించడం ద్వారా కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేయాలని , బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ వారెంట్లు , పెండింగ్ సమన్లు అమలు చేయడంతో పాటు పరారీలో ఉన్న నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని సూచించారు. నేర నియంత్రణలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని , హాట్‌స్పాట్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు మరియు నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడం , నేరాల నియంత్రణ , ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని సూచించారు. ఈ సమావేశంలో నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ , ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్ , వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీనివాస్ , మస్తాన్ అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , మల్లేష్ , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ అంజయ్య , సీఐలు , ఎస్. హెచ్. ఓ లు మరియు ఐటీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**-ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

జూన్ 5 వార్త సాక్ష్యం:

జిల్లాలో పర్యావరణ పరిరక్షణ,అడవులు,జల వనరుల సంరక్షణే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు."ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవా వేడుకలను శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు గీతాలాపన, స్థానిక కళాకారుల స్వాగత నృత్యం ప్రదర్శనలు ఆహ్వానితులను ఎంతగానో అలరిం చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడటం అనేది కేవలం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని,ప్రతి ప్రభుత్వ శాఖతో పాటు జిల్లాలోని ప్రతి పౌరుడు ఇందులో భాగస్వాములు కావాలని అన్నారు. గతంలో ప్రతి ఇంటికి పంపిణీ చేసిన ఆరు మొక్కలను ఇంటి యజమానులు తమ కుటుంబ సభ్యుల్లా బాధ్యతగా సంరక్షించు కోవాలని సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నాటిన మొక్కలు పెరిగేలా విధిగా సర్పంచులు,కౌన్సిలర్లు, స్థానిక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి దుకాణదారుడు తమ షాపుల ముందు మొక్కలను పెంచాలని, పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. అడవుల సంరక్షణతో పాటు స్థానిక గిరిజనులు, ప్రజల ఉపాధి మెరుగుపరచడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. అటవీ సంరక్షణ సమితి ద్వారా లాక్ కల్టివేషన్ ను ప్రోత్సహిస్తూ అటవీ ఉత్పత్తుల ద్వారా స్థానికులకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని చిత్తడి నేలలను గుర్తించి,నోటిఫై చేయడం ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసి,స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యోచిస్తున్నట్లు వెల్లడించారు. మన నీటి నిల్వలకు ప్రధాన ఆధారమైన చెరువులు కబ్జాల బారిన పడకుండా స్థానిక నాయకులు, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు .వ్యవసాయ రంగంలో పంట కోత అనంతరం మిగిలిన వ్యర్థాలను పొలాల్లో కాల్చడంపై కఠిన హెచ్చరికలు జారీ చేశారు. వ్యర్థాలను దహనం చేయడం వల్ల



గాలి పూర్తిగా కాలుష్యమవడమే కాకుండా, భూమిలోని మిత్రపురుగులు చనిపోయి భూసారం తీవ్రంగా దెబ్బతింటుందని,పక్క రైతుల పంటలకు కూడా ప్రమాద కరంగా మారుతుందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి పంట వ్యర్థాలను తగులబెడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు .రైతులు ఈ వ్యర్థాలను కాల్చడానికి ప్రత్యామ్నాయంగా ఆధునిక యంత్రాల ద్వారా భూమిలోనే కలియదున్నుకోవాలని లేదా పశువులకు మేతగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. భూగర్భ జలాలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై జిల్లా ప్రజలు దృష్టి పెట్టాలని కోరారు. రాబోయే కాలంలో బోర్లు ఎండిపోకుండా ఉండాలంటే ఇళ్ల వద్ద, బోర్ల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే, కరెంటు బిల్లుల భారం తగ్గించుకుంటూ శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ పథకాలైన పిఎం సూర్య ఘర్ యోజన,కుసుమ్ యోజనలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్స్, రూఫ్ టాప్ సిస్టమ్స్ అమర్చుకోవాలని పిలుపునిచ్చారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఈ సందర్భంగా విడుదల చేసిన కలెక్టర్ జిల్లాలోని జీవవైవిధ్య ప్రాంతాల ప్రాముఖ్యతనువిద్యార్థులు, ప్రజలు క్షేత్రస్థాయిలో తెలుసుకునేలా 'వన దర్శనం'లాంటి అవగాహన కార్యక్ర మాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. దుకాణదారుడు తమ షాపుల ముందు మొక్కలను పెంచాలని,



పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. అడవుల సంరక్షణతో పాటు స్థానిక గిరిజనులు, ప్రజల ఉపాధి మెరుగుపరచడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. ఇంట్లో మార్కెట్,ఇతర పనుల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పర్యావరణ కాలుష్యం జరుగుతున్న తీరును, నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న సర్పంచ్ లకు, అధికారులకు, ప్రముఖులకు ప్రశంస పత్రాలను కలెక్టర్, ఎస్పీ, అటవీ అధికారి, అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎక్సిబిషన్ ను, కాలుష్య నియంత్రణ మండలి స్టాల్ లను కలెక్టర్, ఎస్పీ కలిసి సందర్శించారు. అంతకుముందు అటవీశాఖ యొక్క పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పోస్టర్ ను, తెలుగు ప్రభ బుక్ లెట్ ను ఇతర అతిథులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాదు మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ సీఈఓ రవి, డిఆర్డీఓ రవీందర్, డిపిఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, డివైఎస్ఓ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ అధికారి రామరావు, ఎఫ్డిఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు. విద్యార్థులు, అటవీ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీ20 కెప్టెన్సీ మార్పు నాకేమీ

# ఆశ్చర్యంగా అనిపించడం లేదు: కైఫ్



భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు త్వరలోనే పెద్ద షాక్ తగలనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. సూర్య టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ప్రచారం జరుగుతోంది. అతడి స్థానంలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం. ఈ పరిణామాలపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ స్పందించాడు. సూర్య కెప్టెన్సీ కోల్పోతున్నాడనే వార్తలు తనను ఆశ్చర్యపరచలేదని పేర్కొన్నాడు.'నాకు ఈ వార్తలు ఆశ్చర్యంగా అనిపించడం లేదు. నిజానికి రోహిత్ శర్మ కెప్టెన్సీ కోల్పోయినప్పుడే నేను ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత ఇలాంటి నిర్ణయాలు సహజంగానే కనిపిస్తున్నాయి. సూర్యకుమార్ యాదవ్ విషయంలో ఇది పెద్ద నిర్ణయమే. కానీ రోహిత్ విషయంలో తీసుకున్న నిర్ణయం ఇంకా పెద్దది. ఇప్పుడు కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నామనే సందేశాన్ని బీసీసీఐ ఇవ్వాలనుకుంటోందని నాకు అనిపిస్తుంది' అని కైఫ్ వెల్లడించాడు.

**-జట్టులో చోటివ్వాలి..**

'సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా టీ20 ప్రపంచ కప్ ట్రోఫీ అందించాడు. అందుకే అతడు జట్టులో కొనసాగేందుకు అర్హుడు. ప్రస్తుతం పరుగులు చేయకపోవచ్చు. కానీ జట్టు విజయవంతంగా ముందుకు సాగుతుంటే ఒక ఆటగాడి ఫామ్‌ను మాత్రమే చూసి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు. నాయకుడిగా అతడు తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నాడు. అందుకే అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. కెప్టెన్సీ నుంచి తప్పించినప్పటికీ జట్టులో మాత్రం చోటివ్వాలి' అని కైఫ్ పేర్కొన్నాడు.

టీ20 జట్టులో నాయకత్వ మార్పుపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ.. సూర్య భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలు భారత క్రికెట్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కెప్టెన్సీ మార్పు నిజమైతే అది టీమిండియా టీ20 ప్రణాళికల్లో కీలక మలుపుగా మారే అవకాశం ఉంది.



## ఒకే ఓవర్లో మూడు వికెట్లు.. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా?




లార్డ్స్ వేదికగా న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు టెస్టు మ్యాచ్ ఆడుతున్నాయి. ఇంగ్లండ్ స్టార్ బౌలర్ ఓలీ రాబిన్సన్ అదిరే రీఎంట్రీ ఇచ్చాడు. అద్భుత ప్రదర్శనతో విధ్వంసం సృష్టిస్తున్నాడు. గురువారం ప్రారంభమైన టెస్టు మ్యాచ్ తొలి రోజునే రాబిన్సన్ వేసిన తొలి ఓవర్ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకే ఓవర్లో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మూడు వికెట్లు తీశాడు. ఈ నేపథ్యంలో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు తెరపైకి వచ్చింది. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా? అంటూ సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది.వర్షం కారణంగా న్యూజిలాండ్-ఇంగ్లండ్ మ్యాచ్ కాసేపు ఆగింది. స్వింగ్‌కు అనుకూలించే లార్డ్స్ పిచ్‌ను పూర్తిగా వినియోగించుకున్న రాబిన్సన్.. వేసిన తొలి ఓవర్‌లోనే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్లను కుదేలు చేశాడు. తొలి రెండు బంతులు డాట్స్, మూడో బంతికి డేవాన్ కాన్వే ఔట్, నాలుగో బంతి డాట్, ఐదో బంతికి కేన్ విలియమ్సన్ ఔట్, ఆరో బంతికి రచిన్ రవీంద్రను పెవిలియన్‌కు పంపి.. న్యూజిలాండ్‌కు గట్టి షాకిచ్చాడు. మూడు వికెట్లు, మెయిడెన్ ఓవర్‌తో ఇంగ్లండ్‌కు శుభారంభాన్ని అందించాడు.

## చెన్నై ప్లాంట్ నుంచి రెండు కొత్త మోడళ్లు




**చెన్నై:**

ఈ ఏడాదిలో చెన్నైలోని తన తయారీ ప్లాంట్ నుంచి రెండు కొత్త మోడళ్లను విడుదల చేయనున్నట్టు హ్యుండయ్ మోటార్ ఇండియా గురువారం ప్రకటించింది. వీటిలో ఒకటి తన తొలి మాస్ మార్కెట్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) కూడా ఉంటుందని తెలిపింది. తమిళనాడును దేశం లో తన ప్రధాన ఈవీ కేంద్రంగా మార్చడానికి కట్టుబడి ఉన్నట్టు కంపెనీ స్పష్టం చేసింది. అలాగే విద్యుత్ వాహనాలు, ఐసీఈ తయారీ కార్యకలాపాల్లో లోకలైజేషన్‌ను పెంపొందించడానికి కంపెనీ కట్టుబడి ఉంది. వచ్చే ఐదు నుంచి ఆరేళ్లలో లోకలైజేషన్‌ను ప్రస్తుతమున్న 82 శాతం నుంచి 90 శాతానికి పెంచాలని కంపెనీ యోచిస్తోంది.20్న మార్కెట్ వాటా టార్గెట్: టాటా మోటార్స్ భారత ఆటోమొబైల్ పరిశ్రమ గణనీయమైన వృద్ధిని సాధించడానికి సిద్ధంగా ఉందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. 2030 నాటికి ఈ పరిశ్రమ 60 లక్షల వాహనాల స్థాయికి చేరుకుంటే.. అందులో 20 శాతానికి పైగా మార్కెట్ వాటాను కంపెనీ లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు.

# టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి పంత్ తొలగింపు.. గంభీర్ రియాక్షన్ ఇదే!




టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో కేఎల్ రాహుల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఇరుజట్ల మధ్య శనివారం నుంచి ఏకైక టెస్టు ముల్లాన్‌పూర్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. పంత్‌ను తొలగించడంపై తొలిసారిగా స్పందించాడు. ఈ నేపథ్యంలో పలు కీలక విషయాల గురించి వెల్లడించాడు.పంత్ తన ఆటతీరును పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. తన దూకుడును అలాగే కొనసాగించాలి. కానీ అంతర్జాతీయ ప్లేయర్లు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాల్సిన అవసరం ఉంటుంది. పంత్‌కు మా పూర్తి మద్దతు ఉంటుంది. సందర్భానుసారంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది కాబట్టే వైస్ కెప్టెన్సీపై ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది' అని గంభీర్ వెల్లడించాడు. రిషబ్ పంత్ ప్రస్తుతం ఫామ్‌లేమితో ఇబ్బందులు పడుతున్నాడు. ఐపీఎల్ 2026లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు సారథ్యం వహించిన పంత్.. పేలవ ప్రదర్శన కనబర్చాడు. జట్టును పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిపాడు. దీనికి బాధ్యత వహిస్తూ పంత్.. ఎల్ఎస్‌జీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.

**-శ్రీలంక సిరీస్ కోసం..**

ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌తో టెస్టులో కుల్‌దీప్ యాదవ్ ప్రధాన స్పిన్నర్. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌కు రెస్ట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆగస్టు మధ్యలో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్.. శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో స్పిన్నర్ల గురించి కూడా గంభీర్ స్పందించాడు. 'మానవ్ సుతార్, హర్ష్ దూబె రూపంలో ఇద్దరు యువ స్పిన్నర్లు ఉన్నారు. అఫ్గాన్‌తో మ్యాచ్ వారికి మంచి అవకాశం. అలాగే మాక్కూడా శ్రీలంకతో టెస్టుల కోసం నాలుగో స్పిన్నర్‌ను పరీక్షించుకొనేందుకు వీలు కలుగుతుంది. అదేవిధంగా న్యూజిలాండ్ పర్యటన కోసం కాస్త భిన్నంగా సన్నద్ధం కావాల్సి ఉంది. టెస్టులు ఆడే కొందరిని అఫ్గాన్‌తో వన్డే సిరీస్ నుంచి తప్పిస్తాం. టెస్టుల కోసం మరింత సన్నద్ధత అవసరం అనేదే మా భావన' అని గౌతీ వెల్లడించాడు.

# ఆర్‌బీఐ పాలసీకి ముందు అప్రమత్తత

రోజంతా లాభ, నష్టాల మధ్య తీవ్ర ఊగిసలాటలకు లోనైన స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు.. చివరికి అతిస్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయు. గురువారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో 737 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. కేవలం 13.84 పాయింట్ల లాభంతో 74,360.01 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.95 పాయింట్ల వృద్ధితో 23,416.55 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను శుక్రవారం ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్త ధోరణితో వ్యవహరించడం ఇందుకు ప్రధాన కారణమైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎ?ఫఐఐ) బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు.డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి. రూ.3,500 కోట్ల ఐపీఓ జూఆడియో బుక్ ప్లాట్‌ఫామ్ కుకు ఎఫ్ఎం, షార్ట్ వీడియో స్ట్రీమింగ్ యాప్ కుకు టీవీల నిర్వహణ సంస్థ కుకు టెక్నాలజీస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. డీఆర్‌హెచ్‌పీలోని వివరాలు బయటికి వెల్లడించాల్సిన అవసరం లేకుండా కంపెనీ కాన్ఫిడెన్షియల్ ఫైలింగ్ మార్గాన్ని ఎంచుకుంది. అయితే, పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.2,500-3,500 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉందని ఈ వ్యవహారంపై అవగాహన కలిగిన వర్గాలు వెల్లడించాయి.



# రామానాయుడు స్టూడియోలో నా ఫొటో ఉండాలనే కోరిక నెరవేరింది: ప్రియమణి

-చాలా ఏళ్ల క్రితం రామానాయుడు స్టూడియోలో అందంగా అలంకరించిన హీరోయిన్ల ఫొటోలు చూశానన్న ప్రియమణి

-వాళ్లంతా సురేష్ ప్రొడక్షన్స్ లో నటించిన హీరోయిన్లని తెలిసిందని వెల్లడి

-తన ఫొటో కూడా ఆ గోడపై స్థానం సంపాదించుకోవాలని అనుకున్నానన్న ప్రియమణి

-'నారప్ప'తో తన కల నెరవేరిందని వెల్లడి

నేషనల్ అవార్డ్ విన్నర్, సీనియర్ నటి ప్రియమణి టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో వచ్చిన 'నారప్ప' చిత్రంలో ఆమె పోషించిన సుందరమ్మ పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుండి భారీ ప్రశంసలు దక్కాయి. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై పెద్ద సక్సెస్ సాధించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ... ఈ సినిమాకు సంబంధించి, అలాగే తన కెరీర్‌కు సంబంధించిన ఒక కీలక విషయాన్ని పంచుకుంది. "చాలా ఏళ్ల క్రితం నేను రామానాయుడు స్టూడియోలో షూటింగ్ చేస్తున్న సమయంలో, అక్కడ ఒక గోడపై ఎంతోమంది ప్రముఖ నటీమణుల ఫొటోలు అందంగా అలంకరించి ఉండటం చూశాను. అప్పట్లో వాటి ప్రాధాన్యత నాకు పూర్తిగా తెలియదు. కానీ ఆ తర్వాత తెలిసింది.. వారంతా ప్రతిష్ఠాత్మక 'సురేష్ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో నటించిన లెజెండరీ హీరోయిన్లు అని. ఆ రోజే నా మనసులో ఒక బలమైన కోరిక కలిగింది.. ఎలాగైనా భవిష్యత్తులో ఆ గోడపై నా ఫొటో కూడా స్థానం సంపాదించుకోవాలని అనుకున్నాను" అని చెప్పుకొచ్చింది.ఆమె అనుకున్నట్లుగానే కొన్ని సంవత్సరాల తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ నుండి 'నారప్ప' రూపంలో ఆమెకు అద్భుతమైన అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన నటించడమే కాకుండా, సురేష్ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్‌లో పనిచేయాలనే దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేసింది. డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ఒక గొప్ప విజన్ ఉన్న దర్శకుడని, నారప్ప చిత్రాన్ని ఎంతో అద్భుతంగా, భావోద్వేగభరితంగా తెరకెక్కించారని కొనియాడింది. 'నారప్ప' సినిమాలో నటించడం వల్లే ఈ రోజు రామానాయుడు స్టూడియోలో ఆ హీరోయిన్ల ఫొటోల పక్కన తన ఫొటో కూడా చేరిందని, ఆ కోరిక నెరవేరడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని ప్రియమణి భావోద్వేగానికి లోనైంది.



## '29' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!




కోలీవుడ్ నుంచి వచ్చే లవ్ స్టోరీస్ లో మంచి ఫీల్ ఉంటుంది. అందువలన ప్రేమకథాంశంతో కూడిన తమిళ సినిమాలకు ఓటీటీలో మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలా ఈ మధ్య కాలంలో తమిళంలో రూపొందిన లవ్ స్టోరీనే '29'. రత్నకుమార్ వినిపించిన ఈ కథ వినగానే, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ .. కార్తీక్ సుబ్బరాజు నిర్మాతలుగా ముందుకు రావడం విశేషం. మే 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 5వ తేదీ) నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. సత్య (విధు) తన తల్లిదండ్రులతో కలిసి 'సేలమ్'లో నివసిస్తూ ఉంటాడు. సత్య మొదటి నుంచి ముక్కుసూటి మనిషి. లోపల ఒకలా .. బయటికి ఒకలా ఉండటం అతనికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తనకి నచ్చినట్టుగా బ్రతకడమే తనకి ఇష్టం. అందుకోసమే అతను 'సేలం' నుంచి చెన్నైకి వెళతాడు. అక్కడే అతను మణి .. వసంత్ అనే స్నేహితులతో కలిసి ఒక రూమ్ లో ఉంటూ ఉంటాడు. జాబ్ విషయంలో అంతగా సంతృప్తి లేకపోయినా, ఖర్చుల కోసం నెట్టుకొస్తుంటాడు.

## త్రిష కాదు.. తిరుచ్చి ఈస్ట్ టీవీకే అభ్యర్థిగా రాఘవ లారెన్స్?



తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు సరికొత్త సమీకరణాలతో హీటెక్కుతున్నాయి. ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో సూపర్ హిట్ విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన దళపతి విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీ... ఇప్పుడు రాబోయే ఉపఎన్నికపై పూర్తి ఫోకస్ పెట్టింది. విజయ్ తాను గెలిచిన రెండు అసెంబ్లీ స్థానాల్లో ఒకటైన తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేయడంతో ఇక్కడ బైపోల్ అనివార్యమైంది.అయితే, ఈ స్థానం నుండి టీవీకే అభ్యర్థిగా ఎవరు నిలబడబోతున్నారనే దానిపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి తెరపడేలా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రముఖ నటుడు, కొరియోగ్రాఫర్, దర్శకుడు రాఘవ లారెన్స్ పేరు ఇప్పుడు తిరుచ్చి ఈస్ట్ రేసులో అత్యంత బలంగా వినిపిస్తోంది.మొదట్లో ఈ స్థానం నుండి స్టార్ హీరోయిన్, విజయ్ స్నేహితురాలు త్రిష పోటీ చేయబోతోందంటూ తమిళ మీడియాతో పాటు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చాయి.



విజయ్ సరసన ఎన్నో హిట్ సినిమాల్లో నటించిన త్రిషను రాజకీయాల్లోకి దించుతున్నారనే వార్త హాట్ టాపిక్‌గా మారింది. కానీ, తాజా సమాచారం ప్రకారం త్రిషకు ప్రస్తుతానికి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఏమాత్రం లేదని తేలిపోవడంతో ఆ ప్రచారానికి పూర్తిగా బ్రేక్ పడింది.రాఘవ లారెన్స్‌కు ఉన్న మాస్ ఇమేజ్, ముఖ్యంగా యువతలో ఉన్న ఫాలోయింగ్, మరియు ఆయన చేసే సేవా కార్యక్రమాలు పార్టీకి భారీగా కలిసివస్తాయని టీవీకే అధిష్ఠానం భావిస్తోంది.

# 'పెద్ది'కి ఊహించని షాక్..

## రెండో రోజే ఆన్‌లైన్‌లోకి వచ్చేసిన హై క్వాలిటీ ప్రింట్స్!

-రామ్ చరణ్ 'పెద్ది' చిత్రానికి పైరసీ షాక్

-విడుదలైన రెండో రోజే ఆన్‌లైన్‌లో హెచ్‌డీ ప్రింట్‌తో సినిమా లీక్

-పైరసీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న మెగా ఫ్యాన్స్

-వసూళ్లపై పైరసీ ప్రభావం చూపుతుందని విశ్లేషకుల ఆందోళన

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన పాన్-ఇండియా స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. అయితే ఈ సినిమా పైరసీ బారినపడడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.

**-విజయం మధ్యలో పైరసీ దెబ్బ**

ఒకవైపు బాక్సాఫీస్ వద్ద 'పెద్ది' కలెక్షన్ల వర్షం కురిపిస్తుండగా.. మరోవైపు చిత్రబృందానికి పైరసీ రూపంలో ఊహించని షాక్ తగిలింది. సినిమా విడుదలైన రెండో రోజే పలు పైరసీ వెబ్‌సైట్లలో హై క్వాలిటీ (హెచ్‌డీ) ప్రింట్ లీక్ అయింది. థియేటర్లలో విజువల్ వండర్‌గా ప్రశంసలు అందుకుంటున్న ఈ సినిమా, ఇంత త్వరగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రావడం పట్ల చిత్ర పరిశ్రమ వర్గాలు, అభిమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ లీకేజీ సినిమా లాంగ్ రన్ వసూళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో మెగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా పైరసీ లింకులను వెంటనే తొలగించాలని, ఈ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను కోరుతున్నారు. ఈ పైరసీ గండాన్ని దాటుకుని 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.

**-తొలిరోజే వంద కోట్లకు పైగా వసూళ్లు!**



భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం, తొలిరోజే రికార్డు స్థాయి వసూళ్లను సాధించింది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. చాలా కాలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి పవర్‌ఫుల్ హిట్ పడటంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం, 'పెద్ది' తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. రామ్ చరణ్ సోలో కెరీర్‌లో ఇదే ఆల్-టైమ్ రికార్డు కావడం విశేషం. ఈ అద్భుతమైన విజయాన్ని పురస్కరించుకుని, మేకర్స్ 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. గ్రామీణ క్రీడా నేపథ్యంతో కూడిన ఈ యాక్షన్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.

# సీఎం విజయ్ 'జననాయగన్' క్లిప్స్ లీక్.. ఆరుగురు పైరసీ ముఠా సభ్యుల అరెస్ట్

తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు జోసెఫ్ విజయ్ (దళపతి విజయ్) నటించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'జననాయగన్' కు సంబంధించిన కీలక దృశ్యాలను ఇంటర్నెట్‌లో లీక్ చేసి, సర్క్యులేట్ చేసిన ఆరోపణలపై తమిళనాడు సైబర్ క్రైమ్ వింగ్ పోలీసులు గురువారం (జూన్ 4) ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. విజయ్ పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు ఆయన నటించిన ఆఖరి (ఫేర్‌వెల్) సినిమా ఇదే కావడంతో, ఈ చిత్రంపై కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఇలాంటి హై-ప్రొఫైల్ ప్రాజెక్ట్ లీక్ కావడం తమిళ చలనచిత్ర పరిశ్రమలో తీవ్ర కలకలం రేపింది.నిందితులు సోషల్ మీడియా వేదికలు, వివిధ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఈ లీక్ అయిన కంటెంట్‌ను డిజిటల్‌గా షేర్ చేసినట్లు అధికారులు గుర్తించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను డిజిటల్ ఫోరెన్సిక్ బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. అసలు ఈ లీక్ ఎక్కడ ప్రారంభమైంది? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ సినిమా లీక్‌లు ఈ ఏడాది ప్రారంభంలోనే వెలుగుచూశాయి. సెన్సార్ బోర్డు సర్టిఫికేషన్ వివాదాల కారణంగా సినిమా విడుదల ఇప్పటికే ఆలస్యం కాగా.. ఈ లోపే హై-డెఫినిషన్ క్వాలిటీతో కూడిన క్లిప్‌లు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవడంతో గత ఏప్రిల్ లోనే పోలీసులు పోస్ట్-ప్రొడక్షన్ విభాగానికి చెందిన కొందరిని అరెస్ట్ చేశారు. తాజా అరెస్టులతో ఈ పైరసీ నెట్‌వర్క్ ఎంత పెద్దదో అర్థమవుతోంది. ఈ అక్రమ లీక్ వల్ల 'జననాయగన్' చిత్ర నిర్మాణ సంస్థ అయిన కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ పైరసీ నెట్‌వర్క్‌లను పూర్తిగా అణచివేయడంలో భాగంగానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైబర్ క్రైమ్ అధికారులు వెల్లడించారు. కాపీరైట్ చట్టాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, సినిమాటోగ్రాఫ్ చట్టాల ప్రకారం ఇటువంటి పైరసీ కంటెంట్‌ను చూడటం లేదా ఇతరులకు షేర్ చేయడం కూడా శిక్షార్హమైన నేరాలని, ప్రజలు ఇలాంటి పనులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొందరిని త్వరలోనే అరెస్ట్ చేసే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేశారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.